
ఎస్సారెస్పీ వరదకాలువ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

ప్రాజెక్టులకు జలకళ

నేడు నిండనున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

- ప్రాజెక్టులో చేరిన నీరు 68.431 టీఎంసీలు
- ఇన్‌ఫ్లో 1,51,806 క్యూసెక్కులు
- మిడ్ మానేరులో నీటి నిల్వ 10.98 టీఎంసీలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు జలకళను సంతరించుకుంటున్నది. సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో 80 టీఎంసీల నీరు వచ్చి చేరే అవకాశం ఉన్నది. ప్రాజెక్టుకు ఎగువన మహారాష్ట్రలో విస్తారంగా కురిసిన వర్షాల కారణంగా 1,51,806 క్యూసెక్కుల వరద వస్తుండడంతో రెండు రోజుల్లోనే ప్రాజెక్టులోకి భారీగా నీరు వచ్చి చేరింది. ఈ నెల 16న ప్రాజెక్టులో 48.518 టీఎంసీల నీరు మాత్రమే ఉండగా 17న సాయంత్రం 7 గంటల వరకు 18 టీఎంసీల నీరు వచ్చి చేరడంతో నీటినిల్వ 68.431 టీఎంసీలకు పెరిగింది. ఈ వరద ఇలాగే కొనసాగే అవకాశాలు కనిపిస్తుండడంతో సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టు పూర్తిగా నిండే అవకాశం ఉన్నది. ప్రాజెక్టులోకి భారీగా వరద వస్తుండడంతో శ్రీరాంసాగర్ నుంచి కాకతీయ కాలువకు 5 వేల క్యూసెక్కుల నీరు, వరద కాలువకు 10 వేల క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. కాకతీయ కాలువ ద్వారా వస్తున్న నీరు నిజామాబాద్, జగిత్యాల జిల్లాల రైతులు, ఎల్ఎండీకి ఎగువన ఉన్న కరీంనగర్ జిల్లా రైతులు వినియోగించుకోగా మిగిలిన 682 క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి వస్తున్నాయి.

మిడ్ మానేరుకు వరద కాలువ, ఎల్లంపల్లి నీరు

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఎగువన ఉన్న కడెం ప్రాజెక్టుకు ఆదిలాబాద్‌లో కురిసిన భారీ వర్షాల కారణంగా భారీగా నీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తివేశారు. దీంతో ప్రాజెక్టులోకి 18.34 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 20.17 టీఎంసీలు. మరో రెండు టీఎంసీల నీరు వస్తే ప్రాజెక్టు పూర్తిగా నిండుతుంది. ప్రాజెక్టుకు భారీగా వరద వస్తున్న

(మిగతా 8వ పేజీలో)


శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

ముగిసిన జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు

- వివిధ ప్రాంతాల నుంచి 160 మంది క్రీడాకారుల హాజరు


హైజంప్ చేస్తున్న క్రీడాకారుడు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ముగిశాయి. జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 160 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటారు. జూనియర్స్ విభాగంలో అండర్-14, 16, 20 వయస్సు విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభచాటిన క్రీడాకారులను 30 మందిని ఈ నెల 30, 31 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లాలోని పాలమూరు యూనివర్సిటీలో నిర్వహించే 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీల నిర్వహణను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు నందెల్లి మహిపాల్ పర్యవేక్షించగా, జిల్లా అథ్లెటిక్ సంఘ సభ్యులు చంద్రశేఖర్, ఎస్ రమేష్, హరికిషన్, గోపాల్, డాక్టర్ ఎజాజ్ అహ్మద్, సుమన్, కోచ్‌లు వరుణ్ కృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే 'పది' పరీక్షలు

- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ
- రాత పరీక్షకు 80, ఇంటర్నల్‌కు 20 మార్కులు



కరీంనగర్ టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు పాత పద్ధతిలోనే జరుగనున్నాయి. రాత పరీక్షకు 80 మార్కులు, ఇంటర్నల్‌కు 20 మార్కులు యధావిధిగా కొనసా గిస్తున్నట్లు విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఉపాధ్యాయ సంఘాలు ఇంటర్నల్ మార్కుల విధానాన్ని స్వాగతిస్తున్నప్పటికీ విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడచిన తర్వాత విద్యాశాఖ ఆదేశాలు ఇవ్వడంపై మరి కొంత మంది ఉపాధ్యాయులు విచారం వ్యక్తం చేస్తున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 2011 నుంచి 80 మార్కులకు రాత పరీక్ష, 20 మార్కులకు ఇంటర్నల్స్ నిర్వహిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఆయా పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు 20కి 20 ఇంటర్నల్ మార్కులు వేస్తుండటంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పడిపోతుందని ప్రభుత్వం ఇంటర్నల్ మార్కుల విధానాన్ని రద్దు చేసి 2024-25 విద్యాసంవత్సరం నుంచి 100 మార్కులకు పదో తరగతి వార్షిక పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొంది. ఉపాధ్యాయ సంఘాలు, ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు వ్యతిరేకించడంతో ప్రభుత్వం గతేడాది తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకుంది. 2025-26 నుంచి 100 మార్కులకు రాత పరీక్షలు నిర్వహి స్తామని ప్రభుత్వం ప్రకటించి రెండు నెలలు గడచిన తర్వాత పాత విధానాన్నే కొనసాగిస్తున్నట్లు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

ఎస్‌సీఈఆర్‌టీ అభిప్రాయం మేరకే

పదోతరగతి ఇంటర్నల్ మార్కులను రద్దు చేయడంపై జాతీయ విద్యా పరిశోధనా శిక్షణా మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) ప్రభుత్వాన్ని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షల్లో 20 శాతం ఇంటర్నల్, 80 శాతం వార్షిక పరీక్షలకు మార్కులు కేటాయిస్తే తెలంగాణలో ఎలా ఇంటర్నల్స్‌ను రద్దు చేస్తారని ఇటీవల నిర్వ హించిన వర్క్‌షాపులో రాష్ట్ర విద్యాశాఖ అధికారులతో చర్చించినట్లు సమాచారం. దీంతో విద్యాశాఖ అధికారులు పాత విధానాన్నే కొనసాగించాలని ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపడంతో ప్రభుత్వం అంగీకరించగా విద్యాశాఖ అధికారులు ఇంటర్నల్ విధానాన్ని యధావిధిగా అమలు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

ఘనంగా 'నందోత్సవం'


ప్రవచనం చేస్తున్న నరహరి ప్రభుదాస్

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా కృష్ణ జననం తర్వాత నందుని ఇంట మరుసటి రోజు జరిగిన వేడుకలో భాగంగా ఆదివారం ఉజ్వల పార్క్ సమీపంలోని ఇస్కాన్ టెంపుల్‌లో 'నందోత్సవం' ఘనంగా నిర్వహించారు. అలాగే ఇదే రోజున జన్మించిన ఇస్కాన్ వ్యవస్థాపకుడు ఏసి భక్తి వేదాంత ప్రభుపాదుల జన్మదిన వేడుకను జరిపారు. ఈ కార్యక్రమంలో కన్న కృష్ణ, డాక్టర్ ఎల్ రాజభాస్కర్‌రెడ్డి, తుమ్మల రమేశ్‌రెడ్డి, డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, పోరెడ్డి శ్రీహరిరెడ్డి, కొమురవెల్లి వేంకటేశం పాల్గొన్నారు.

బహుజన ముద్దుబిడ్డ సర్వాయి పాపన్న

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గోల్కొండ కోటపై జెండా ఎగరేసిన బహుజనుల ముద్దుబిడ్డ సర్వాయి పాపన్న అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సర్దార్ పాపన్న జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని కరీంనగర్ శివారులో సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య కల్లు గీత కుటుంబంలో జన్మించి నాటి మొఘల్ చక్రవర్తుల వెన్నులో వణుకు పుట్టించిన అసామాన్యుడు మన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అన్నారు. ఆనాటి మొఘల్ చక్రవర్తుల నిరంకుశ పాలనను, స్థానిక జమిందారులు, జాగీర్ దారులు, దేశ్ ముఖ్‌లు, భూస్వా ముల దోపిడీని, దౌర్జన్యాలను ఎదిరించాడన్నారు. ఒక్కనితో ప్రారంభమైన సర్దార్ పాపన్న పోరాటం సబ్బండ కులాల పీడిత ప్రజలను సమీ కరించుకొని సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని.. గెరిల్లా పోరా టాలు చేస్తూ తన స్వస్థలం ఖిలాషాపూర్ రాజధానిగా పాలన సాగించాడన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్‌రావు, సర్వాయి పాపన్న గౌడ్ రాష్ట్ర అధ్యక్షుడు కోడూరి పర్శరాములు గౌడ్, జిల్లా అధ్యక్షులు బుర్ర పర్శరాములు గౌడ్, గణగోని సత్తన్న గౌడ్, పడాల రమేశ్ గౌడ్, బుర్ర కనకయ్య గౌడ్, పతంగి అనిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

బీసీ రిజర్వేషన్ అమలుకు పార్లమెంట్‌లో కృషి చేయాలి


మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో బీసీ కుల సంఘాల ఐక్యవేదిక నాయకులు

కరీంనగర్ టౌన్/గణేశ్‌నగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు అయ్యే విధంగా పార్లమెంట్ స్థాయిలో కృషి చేయాలని బీసీ కుల సంఘాల ఐక్య వేదిక నాయకులు మల్కాజిగిరి ఎంపీ, మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ను కోరారు. ఈ మే రకు ఆదివారం ఈటల రాజేందర్‌ను కరీంనగర్‌లో ఐక్య వేదిక నాయకులు కలిసి మాట్లాడారు. తెలంగాణలో గతంలో కన్నా ఇప్పుడు బీసీ ఉద్యమం బలోపేతం అవుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ బీసీల రాజ్యాధికారం కోసం తన ప్రయత్నం ఉంటుందని బీసీ సమాజం ఏకమై ఉద్యమం చేస్తే బీసీలకు రావాల్సిన అన్ని డిమాండ్‌ల పరిష్కారం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో వేదిక రాష్ట్ర అధ్య క్షుడు గుంజపడుగు హరిప్రసాద్, నాయ కులు కలర్ సత్తన్న, కర్రె శ్రీనివాస్, సిద్ధి సంపత్, కనకయ్య ప్రజా పతి, ఎకుల రమేష్, రంగరవేణి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు లేక.. అభివృద్ధికి నోచుకోక..

సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న గ్రామ పంచాయతీలు

జాడలేని ఎస్ఎఫ్‌సీ నిధులు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నిధులు లేక గ్రామ పంచాయతీలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని నెలలుగా పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది. ముఖ్యంగా ఆదాయ వనరులు అంతగా లేని చిన్న గ్రామ పంచాయతీల్లో కనీసం కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నాయి. అసలే వర్షాకాలం, వ్యాధులు ముసిరే పరిస్థితుల్లో గ్రామ పంచాయతీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛ-పచ్చదనం త్వరలో నిర్వహించే వినాయక నవరాత్రి ఉత్సవా లు, బతుకమ్మ, దసరా పండుగ సంబరాలకు నిధులలేమి సమస్యగా మారనుంది. ఇప్పటికే తామే అప్పులు తీసుకువచ్చి గ్రామ పంచాయతీల్లో పెట్టి అప్పుల బాధ పడుతు న్నామని కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 18నెలలుగా నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామాల్లో ఏ పని చేయలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయం

నామమాత్రంగా ప్రత్యేకాధికారుల పాలన

కేంద్రం ఇచ్చే ఆర్థికం సంఘం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఎస్ఎఫ్‌సీ (రాష్ట్ర ఆర్థిక సంఘం) నిధులు సైతం కొన్ని నెలలుగా విడుదల కాలేదు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి 18 నెలలు గడుస్తోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రత్యేకాధికారుల పాలనలోనే గ్రామాలు ఉన్నాయి. కాగా 2024 ఫిబ్రవరిలో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైనా ఎలాంటి అభివృద్ధి పనులకు నోచుకోలేదు. పాలకవర్గాలు లేని కారణంగా పంచాయతీలకు కేంద్రం విడుదల చేయాల్సిన నిధుల ను ఆపేసింది. కరీంనగర్ రూరల్ మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా ఇటీవల మూడు గ్రామాలైన దుర్శేడ్, బొమ్మకల్, గోపాల్‌పూర్ గ్రామాలు కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనమయ్యాయి. కరీంనగర్ రూరల్ మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 15వ ఆర్థిక సంఘం కింద ప్రతి నెల మండలానికి దాదాపు కోటి రూపా యల చొప్పున ఇప్పటి వరకు మొత్తం 14 కోట్ల రూపాయలు నిలిచిపోయాయి. దీంతో అభివృద్ధి పనుల్లో ఆటంకం ఏర్పడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎస్ఎఫ్‌సీ నిధులు సైతం 14నెలలుగా విడుదల కావడం లేదు. గతంలో సర్పంచ్‌లు గ్రామాల్లో పనిచేసిన పనులకు బిల్లులు కూడా చెల్లించలేదు. గ్రామాల్లో ఏవైనా పనులు ఉంటే కార్యదర్శులు అప్పులు తీసుకువచ్చి పంచాయతీల్లో ఖర్చు పెడుతున్నారు.


చెర్లబూత్కూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

కారుకు నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తులు

గంగాధర, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం మధురానగర్‌లో ఇంటిపక్కన పార్క్‌చేసిన కారుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయనవివరాల ప్రకారం.. మధురానగర్‌లో మోతె శ్రీహరిరెడ్డి తన కారును ఇంటిపక్కన పార్క్ చేశాడు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కారుకు నిప్పంటించారు. గమనించిన శ్రీహరిరెడ్డి మంటలను ఆర్పి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం

గంగాధర, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాలప్రకారం.. గంగాధరకు చెందిన పెగుడ మల్లమ్మ(73) శనివారం ఇంటినుంచి బయటికి వెళ్లింది. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెదికినా ఆచూకీ లభించలేదు. వృద్ధురాలు మల్లమ్మ తమ్ముడు ఈరవేణి రాయమల్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన లారీ

శంకరపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్- వరంగల్ జాతీయ రహదారిపై తాడికల్ శివారులో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సును లారీఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ నుంచి కరీంనగర్‌కు ఆర్టీసీ వెళ్తున్న ఎలక్ట్రిక్ బస్సును శంకరపట్నం మండలం తాడికల్‌శివారులో ఎదురుగా వస్తున్న లారీఢీకొట్టింది. ఈఘటనలో ఆర్టీసీ బస్సు పాక్షికంగా దెబ్బతింది. డ్రైవర్ సతీష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో ప్రయాణి స్తున్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగ లేదు. స్థానికుల సమాచారంతో బ్లూకోర్టుసిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

- మధుర స్మృతులు శాశ్వతం
- రేపు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

'దృశ్యం' పదిలం



సిరిసిల్ల/కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అందమైన, అద్భుతమైన సన్నివేశాలను కెమెరాలో భద్రపరిస్తే జీవితకాలం పదిలంగానే ఉంటాయి. నాటి జ్ఞాపకాలను ఎల్లప్పుడూ తనివి తీరా వీక్షించుకునే అవకాశాన్ని ఇచ్చేవి ఫొటోలు. అపురూప బంధాలను, మధురమైన క్షణాలను అజరామరాం చేయడమే కాదు చరిత్రను మేలుకొలిపే శక్తి ఫొటోలకు ఉంది. దృశ్యం క్షణకాలంలో చెరిగిపోతుంది. ఆ దృశ్యాన్ని బంధీ చేసేది.. మధుర స్మృతులను శాశ్వతంగా నిలిపేది ఫొటోగ్రఫీ. ఏ శుభకార్యమైనా కెమెరా లేకుండా జరుపుకోవడం అనేది ఊహించని విషయమే. ఫొటోగ్రఫీ నాటి నుంచి నేటి వరకు అనేక ఆధునిక పోకడలను సొంతం చేసుకుంది. కెమెరాకు దాదాపు 186 సంవత్సరాలు నిండాయి. ఎన్నో ఏళ్ల క్రితం ప్రారంభమైన ఛాయా చిత్ర ప్రస్థానం ఎన్నో మార్పులు చెందింది. ప్రతి యేటా ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

● నేపథ్యం ఇది..



ఫొటోగ్రఫీ అనే పదం రెండు గ్రీక్ పదాల కలయిక నుంచి వచ్చింది. ఫొటో అంటే 'కాంతి'... గ్రాఫ్ అంటే రాయడం.. అంటే కాంతితో రాయడం అనే అర్థం వస్తుంది. 1820లో ఫొటో తీసే పరికరాన్ని ఫ్రెంచి శాస్త్రవేత్త జోసఫ్ నీస్ ఫోర్ తయారుచేసి తొలి ఫోటోను తీశారు. 1839 ఆగస్టు 18న ఫ్రాన్స్‌కు చెందిన ఎల్‌జె ఎం డాగూరే సిల్వర్ అయోడైడ్ విధానం ద్వారా దృశ్యాన్ని శాశ్వతంగా ఉంచవచ్చని నిరూపించాడు. 1839 ఆగస్టు 19న ఈ విషయాన్ని ప్రపంచానికి చాటారు. 1839లో ఫ్రాన్స్ నుంచి ఇంగ్లాండుకు చేరితే అదే సమయంలో భారతదేశానికి వచ్చింది. 1961లో కరీంనగర్‌లో మొదటిసారి ఫోటోస్టూడియో ఏర్పాటు చేశారు. 1980లో కంప్యూటర్ రైజ్డ్ ప్రింటింగ్ మిషన్లతో కలర్ ఫొటోగ్రఫీ ప్రభంజనం మొదలైంది.

● సెల్ఫీ.. సెల్ఫీ:

కెమెరా కనుగొన్నప్పటికీ మొదట ఫొటోలు తీయడం పెద్ద ప్రహసనంగానే ఉండేది. మొదట కెమెరా చాలా పెద్దదిగా ఉండేది. ఒక వాహనానికి అమర్చి ఫొటోలు తీసేవారు. ఇప్పుడు సెల్‌ఫోన్ రాగా, అందులో కెమెరా ఫోన్లతో ఫొటోగ్రఫీ రంగంలో అనేక మార్పులు వచ్చాయి. గతంలో ఫొటోలు తీసుకోవాలంటే కెమెరాలు, మరో వ్యక్తి అవసరం వచ్చేది. ఇప్పుడు సెల్‌ఫోన్ వల్ల ఫ్రంట్ కెమెరాతో సెల్ఫీల జోరందుకుంది.

● ఫొటోగ్రఫీ కోర్సులు

ఫొటోగ్రఫీ ద్వారా విస్తృత అవకాశాలున్నాయి. వివిధ కంపెనీలకు ఫొటోగ్రాఫర్లు అవసరం ఉండగా, పత్రికల్లో ఫొటోగ్రాఫర్లుగా, సినిమా స్టూడియోల్లో కూడా అవకాశాలున్నాయి. ఫొటోగ్రఫీ కోర్సులు కూడా లభిస్తున్నాయి. జేఎన్‌టీయూలో బ్యాచిలర్స్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వెంకటేశ్వర ఫైన్‌ఆర్ట్స్ కళాశాల, లకోటియా ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్, జేఎన్‌టీయూలో విజువల్ కమ్యూనికేషన్‌లో శిక్షణ, అంతేకాకుండా ప్రైవేటు సంస్థలు ఆన్‌లైన్‌ల ద్వారా కూడా కోర్సులు అందిస్తున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లిలో గిరిజ న ఫైన్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినిలకు ఫొటోగ్రఫీ కోర్సులను కూడా అందిస్తున్నారు. ఫొటోగ్రఫీలో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి బండి రాజన్‌బాబును స్ఫూర్తిగా తీసుకుని ఎంతో మంది ఫొటోగ్రాఫర్లు అంతర్జాతీయ కీర్తి కెరటాల వైపు దూసుకెళ్లారు.

అద్భుతం.. ఆయన ఫొటోగ్రఫీ

మల్యాల: మల్యాలకు చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ మండలోజు శ్రీనివాస్ ఫొటోగ్రఫీలో అద్భుతంగా రాణిస్తూ, రాష్ట్ర జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నాడు. 45 ఏళ్ళుగా కళాత్మక చిత్రాలు తీస్తూ ప్రశంసలు పొందుతున్నారు. ఏ రాష్ట్రాల్లో ఫొటోగ్రఫీ పోటీలు జరిగినా ఆయన పాల్గొంటారు. మల్యాల కెమెరా క్లబ్‌ను స్థాపించి వినూత్నమైన ఫొటోలు తీస్తూ ఆకట్టుకుంటున్నాడు.



మండలోజు శ్రీనివాస్



నీరుకుళ్లలో తాటి, ఈత చెట్లు ధ్వంసం

సుల్తానాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నీరుకుళ్ల గ్రామంలో నాటిన తాటి ఈత చెట్లను కొందరు ఎక్స్‌కవేటర్‌తో ధ్వంసం చేశారని గీత కార్మికులు తెలిపారు. ఆదివారం ఉదయం పనులు ముగించుకుని ఇంటికి వెళ్ళిన సమయంలో భూమి యజమానులుగా చెపుకుంటున్న కొందరు చెట్లను ధ్వంసం చేయిస్తూ భూమి చదును చేస్తున్న సమాచారాన్ని తెలిసిందన్నారు. తాము సంఘటన స్థలానికి చేరుకుని పనులను అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చామని గీత కార్మికులు శ్రీనివాస్, మల్లేశం తదితరులు తెలిపారు. ఎక్సైజ్ అధికారులకు ఫోన్ చేస్తే స్పందించలేదన్నారు. ఇటీవల ఈ భూములను కొన్నామని చెబుతున్న వ్యక్తులు దాదాపు వంద చెట్లను ధ్వంసం చేయించారని కార్మికులు తెలిపారు. ఇరువర్గాల వారు పోలీసుల వద్దకు వెలుతున్నట్లు తెలిపారు.



ధ్వంసమైన తాటి, ఈత చెట్లు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

హుజూరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలి పిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ పట్టణంలోని కిందివాడకు చెందిన హోంగార్డు బొడిగ తిరుపతి కుమారుడు సందీప్(25) ఆదివారం తన స్కూటీపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాలీఆటో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సందీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతన్ని ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ విషయంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



సందీప్(ఫైల్)

ఉరివేసుకొని ఒకరి బలవన్మరణం

సైదాపూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన సంతపురి రవీందర్‌రెడ్డి(65) అనారోగ్య కారణాలతో శనివారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపినవివరాల ప్రకారం.. రవీందర్‌రెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతోపాటు తనను చూసుకోవడానికి ఎవరూ లేరని బాధపడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి 9గంటల ప్రాంతంలో ఇంటి ముందు రేకుల కింద పడుకుంటానని చెప్పి వెళ్లాడు. ఉదయం ఆరు గంటలకు మృతుడి భార్యలేచి చూసేసరికి రేకులకు ఉరివేసుకొని మృతి చెంది ఉన్నాడు. వెంటనే ఆమె కూతురు శైలజకు సమాచారం అందించింది. మృతుడు రవీందర్‌రెడ్డి కూతురు శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

బావిలో పడి మతిస్థిమితం లేని మహిళ మృతి

శంకరపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని ఓ మహిళ వ్యవసాయ బావిలోపడి మృతిచెందిన సంఘటన శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపినవివరాల ప్రకారం కాచాపూర్ గ్రామానికి చెందిన అబ్బు శకుంతల (58) అనే మహిళ కొంతకాలంగా అనారోగ్యం, మానసిక సమస్యలతో బాధపడుతోంది. కుటుంబసభ్యులు ఆమెను ఆస్పత్రిలో చూపించి వైద్యం చేయిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో భర్త నిద్రిస్తుండగా శకుంతల బయటకు వెళ్లి గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్థుల సహాయంతో వ్యవసాయ బావినుంచి శకుంతల మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త సత్యనారాయణరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

ప్రమాదవశాత్తు కిందపడి మేస్త్రీ మృతి

తిమ్మాపూర్/మానకొండూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు కిందపడి మేస్త్రీ మృతిచెందిన సంఘటన మానకొండూర్ మండలం శ్రీనివాస్ నగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ మండల కేంద్రానికి చెందిన కొంద్ర రమేష్(50) మేస్త్రీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రమేష్ రోజులాగానే ఆదివారం కూడా మండలంలోని శ్రీనివాస్ నగర్‌లో ఎరవేణి లక్ష్మణ్ ఇంటి నిర్మాణం పనులకు మేస్త్రీగా పనులు చేసేందుకు వెళ్లాడు. పనులు చేస్తున్న క్రమంలో రమేష్ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. వెంటనే అతన్ని చికిత్సనిమిత్తం కరీంనగర్ తరలించగా ఆసుపత్రికి తీసుకెళ్లే సరికే మృతిచెందాడు. ఈ మేరకు మానకొండూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కొంద్ర రమేష్(ఫైల్)

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

పెగడపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పెగడ పల్లి మండలం బతికెపల్లి గ్రామానికి చెందిన మన్నె రాజనర్సు(59)అనేవ్యక్తి ఆదివారం చేపల వేటకు వెళ్లి తిరిగి వస్తుండగా పొలం గట్టుపై నుంచిపడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం చెరువులో చేపలు పట్టి తిరిగి వస్తుండగా పొలం గట్టుపై నుంచి జారిపడ్డాడు. దీంతో రాజనర్సు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య మన్నె లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ కిరణ్ కుమార్ తెలిపారు.



రాజనర్సు(ఫైల్)

బంగారు పతకాలు సాధించిన సైనిక్ స్కూల్ విద్యార్థులు

చొప్పదండి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో వివిధ విభాగాల్లో మండలంలోని రుక్మాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ స్కూల్ విద్యార్థులు బంగారు పతకాలను సాధించారు. అండర్-20 విభాగంలో 100మీటర్లరన్నింగ్‌లో గణేష్, లాంగ్‌జంప్‌లో విష్ణువర్ధన్ బంగారు పతకాలను సాధించారు. అండర్-16 హైజంప్ విభాగంలో అభిలాష్, 3కిలోమీటర్లు, 5కిలోమీటర్ల నడకలో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాలను సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. కాగా పతకాలు సాధించిన విద్యార్థులను పీఈటీ సుమన్, ప్రిన్సిపాల్ జి కాళహస్తి, ఎస్‌వీపీ శ్రీనివాస్, జేవీపీ ప్రమోద్‌రాజ్ అభినందించారు.



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు



రథయాత్రలో యాదవ సంఘం నాయకులు

నగరానికి చేరుకున్న రెజంగ్ల రజ్ కలశ యాత్ర

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బీహార్ నుంచి ప్రారంభమైన 122రోజుల రెజంగ్ల రజ్ కలశ యాత్ర ఆదివారం నగరానికి చేరుకుంది. 1962లో జరిగిన యుద్ధంలో 1400మంది చైనా సైనికులను మట్టుపెట్టి ప్రాణత్యాగం చేసిన 114మంది యాదవ వీరుల సంస్మరణార్థం అహిర్(యాదవ్) రేంజ్‌మెంట్ స్థాపనకోసం బీహార్ నుంచి యాత్ర ప్రారంభించారు. యాత్రకు అఖిల భారత యాదవ మహాసభ సంఘం జిల్లా నాయకులు స్వాగతం పలికారు. వివేకానంద స్కూల్లో జరిగిన సమావేశంలో పలువురు వక్తలు యాత్ర ఉద్దేశాన్ని వివరించారు. జాతీయ కార్యవర్గ సభ్యుడు, ర్యాలీ కన్వీనర్ సందవేని మహేందర్, ఓదేలు, సొగాని కొమురయ్య, నాగారపు సత్యనారాయణ, జక్కుల శ్రీనివాస్, జంగిలి ఐలేందర్, మంచాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ గ్యాస్ కార్యాలయంలో చోరీ

చందుర్తి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఇండియన్ గ్యాస్ గోదాం కార్యాలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సైరమేష్ కథనం ప్రకారం.. గ్యాస్ గోదాం ఆవరణలో కార్యాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ.7000ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. శనివారం ఇండియన్ గ్యాస్ గోదాంకు తాళంవేసి ఇంటికి వెళ్లి ఆదివారం ఉదయం 8 గంటలకు వెళ్లి చూడగా, ఆఫీస్‌రూమ్ గోడకు రంధ్రంచేసి, ఆఫీస్‌లో రికార్డ్స్ చెల్లాచెదురుగా పడేశారు. కౌంటర్‌లోగల ఏడు వేల రూపాయలు నగదు ఎత్తుకెళ్లినట్లు నిర్వాహకులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు.



చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

ఆర్టీసీ బస్సును ఢీకొన్న బైక్

● ఇద్దరికి తీవ్ర గాయాలు

చందుర్తి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారని తప్పించుకునేందుకు బైక్‌ను అకస్మాత్తుగా వెనక్కి మలపడంతో ఆర్టీసీ బస్సును ఢీకొని ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలైన సంఘటన చందుర్తిమండలం మూడపల్లి బస్టాండ్‌సమీపంలో ఆదివారం చోటుచేసుకుం ది. స్థానికుల కథనం ప్రకారం.. చందుర్తి మండలంలోని సనుగుల గ్రామా నికి చెందిన బొజ్జ చరణ్, ఎండి షారుక్ అనే ఇద్దరు యువకులు బైక్‌పై వేములవాడ వెళ్తున్నారు. మూడపెల్లి గ్రామంలోని కోరుట్ల-వేములవాడ ప్రధానరహదారిపై బైక్‌పై వేములవాడవైపు వస్తుండగా, మూడపల్లి బస్టాండ్‌వద్ద పోలీసులు వాహనాలు తనిఖీచేస్తున్న క్రమంలో నర్సింగాపూర్ వైపునకు రోడ్ క్రాస్ చేస్తుండగా వేములవాడ వైపు వెళ్లే కోరుట్ల డిపోకు చెందిన ఆర్టీసీబస్సును ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో ఎండి షారుక్, చరణ్‌కు గాయాలు కాగా షారుక్ తలకు తీవ్రగాయం కాగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. ఇద్దరు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

చినుకు పడితే చిత్తడే

● అధ్వానంగా గ్రామీణ రోడ్లు

రామడుగు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): చినుకుపడితే చాలు గ్రామీణ రోడ్లన్నీ చిత్తడి అవుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని ప్రధాన రహదారుల తోపాటు అంతర్గత రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా తయారయింది. ఎటు చూసినా బురదమయమైన రోడ్లు ప్రత్యక్షమవుతున్నాయి. గోపాల్‌రావుపేట నుంచి ప్రధానరహదారి అక్కడక్కడ గుంతలమయమై నీళ్లు నిలిచి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. నూతనంగా నిర్మించిన బ్రిడ్జి వద్ద అప్రోచ్‌రోడ్డు నిర్మించకపోవడంతో గుంతలు పడి దిగబడుతున్న పరిస్థితి ఏర్పడింది. ఇటీవల అక్కడ మట్టి పోయడంతో కొంత మెరుగ్గా కనబడినప్పటికీ ప్రస్తుత వర్షాలకు తిరిగి యథాస్థానానికి వచ్చే పరిస్థితి నెలకొంది. రామడుగు, గోపాల్‌రావుపేట, చిప్పకుర్తి, రామచంద్రపురం, వెదిర, గుండి, లక్ష్మీపూర్ తోపాటు అన్ని గ్రామాల్లో రోడ్లు దెబ్బతిని చిన్న వానకే కాలుతీసి కాలు వేయని పరిస్థితి నెలకొంది. వెంటనే రోడ్లను బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



రామడుగులో బురదమయమైన అప్రోచ్ రోడ్డు



గోపాల్‌రావుపేటలో అధ్వానంగా మారిన రహదారి

ట్యాంకర్ ఢీకొని పాదచారుడి మృతి

● వాహనం సమాచారం ఇచ్చిన యువకుడికి సీఐ అభినందనలు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని బొమ్మకల్ ఫ్లైఓవర్‌పై సిమెంట్ టాంకర్ ఢీకొన్ని ప్రమాదంలో పాదచారుడు దుర్మరణం చెందాడు. కరీంనగర్ రూరల్ సీఐ వివరాల ప్రకారం.. చొప్పదండి మండలం చాకుంట గ్రామానికి చెందిన అస్తపురం రవి(35) ఆదివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో బొమ్మకల్ ఫ్లైఓవర్‌పై నడుచు కుంటూ వెళుతుండగా కరీంనగర్ నుంచి పెద్దపల్లి వైపు వెళుతున్న సిమెంట్ ట్యాంకర్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. కిందపడిపోయిన రవి రెండుకాళ్లపై నుంచి లారీవెళ్లడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. అయితే ప్రమాదానికి కారణమైన ట్యాంకర్ ఆగకుండా వెళ్లిపోయింది. దీనిని గమనించిన సుల్తానాబాద్ గట్టెపల్లికి చెందిన బండారి శివకుమార్ అనేయువకుడు ట్యాంకర్‌ను బైక్‌పై వెంబడించి ఒక హోటల్ వద్ద నిలిపి వేయించాడు. ట్యాంకర్ వివరాలు, డ్రైవర్ వివరాలు సేకరించిన శివకుమార్ కరీంనగర్ రూరల్ పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన పోలీసులు ప్రమాదానికి కారణమైన ట్యాంకర్‌ను, డ్రైవర్ ఉత్తర ప్రదేశ్‌కు మీర్జాపూర్‌కు చెందిన కృష్ణకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ట్యాంకర్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ఒకరి మృతికి కారణమైన టాంకర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన ట్యాంకర్ పట్టుకుని సమాచారాన్ని అందించిన బండారి శివకుమార్‌ను సీఐ నిరంజన్ రెడ్డి అభినందించారు.



శివకుమార్‌ను అభినందిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

సర్దార్ సర్వాయి పాపన్న సేవలను గుర్తు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి తిరుపతి

చిగురుమామిడి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్న సేవలను గుర్తు చేసుకోవాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి తిరుపతి గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న 375వ జయంతి వేడుకల నిర్వహణపై సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. గౌడ సోదరులు ముందుండి బహుజనులను ఆహ్వానిస్తూ, పాపన్న బహుజనుల కోసం చేసిన సేవలను తెలియజేయాలన్నారు. గ్రామాల్లో సర్వాయి పాపన్న విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి వేడుకలను నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షుడు ముంజ ప్రకాశ్, ప్రచార కార్యదర్శి పచ్చిమట్ల శ్రీనివాస్, సుందరగిరి గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్ళపల్లి సంపత్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ తాళ్ళపల్లి చంద్రయ్య, తాళ్ళపల్లి కిరణ్, కక్కర్ల వీరకుమార్, మహేందర్, శ్రీనివాస్, సురేష్, ముంజ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

మల్యాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం తక్కళ్లపల్లికి చెందినచందు అనే యువకుడు రెండు నెలల క్రితం తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా ఆదివారం పోలీసులు పట్టుకొని అప్పగించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్ ట్రాక్‌చేయగా సెల్‌ఫోన్ ఆచూకీ లభించింది. దీంతో ఆదివారం బాధితుడు చందుకు ఫోన్‌ను ఎస్సై నరేశ్‌కుమార్ అప్పగించారు. కార్యక్రమంలో ఏఎస్సై కృష్ణకుమార్ ఉన్నారు.



బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై నరేశ్‌కుమార్

డీఎల్ఎడ్ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్స్

తిమ్మాపూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్ఎడ్) కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లకు ప్రభుత్వం స్పాట్ అడ్మిషన్స్‌కు అవకాశం కల్పించినట్లు మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. డీసెట్ 2025 ఉత్తీర్ణులై, అర్హత, ఆసక్తి ఉండి, ఇప్పటివరకు ప్రవేశం పొందని అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. డీసెట్2025 వెబ్‌సైట్‌ను పరిశీలించి తమతమ కేటగిరి సీట్లు ఖాళీగా ఉన్న కళాశాలను ఎంపిక చేసు కోవాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 19న ఉదయం 10 గంటలకు ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణాసంస్థ, ఎల్ఎండీ కాలనీకి రావాలని పేర్కొన్నారు. 20న ప్రైవేటు కళాశాలలకు ఉదయం 10 గంటలకు వెళ్లి సంబంధిత సీటు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

తీర్థయాత్రలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

భగత్‌నగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసాన్ని పురస్కరించుకుని కరీంనగర్-1 డిపో నుండి తీర్థయాత్రలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడిపిస్తున్నట్లు కరీంనగర్-1 డిపో మేనేజర్ ఐ విజయమాధురి ఒకప్రకటనలో తెలిపారు. కరీంనగర్ బస్టాండ్ నుండి 21వ తేదీ గురువారం సాయంత్రం 6 గంటలకి బస్సు బయలుదేరుతుందన్నారు. అన్నవరం, పిఠాపురం శక్తి పీఠం, సింహాచలం, వైజాగ్, ఆర్కె బీచ్, ద్వారక తిరుమల దర్శనాల అనంతరం 23 వ తేదీ కరీంనగర్ చేరుకుంటుందన్నారు. ఈ బస్సులో పెద్దలకు 3000 రూపాయలు, పిల్లలకు 2250 రూపాయలుగా నిర్ణయించామన్నారు. మరిన్ని వివరాలకు 9959225920, 8074690491, 7382849352 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సర్వాయిపేటకు పర్యాటక శోభ

- పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దేందుకు అభివృద్ధి పనులు
- నేడు సర్వాయి పాపన్న జయంతి

సైదాపూర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలో సర్దార్ సర్వాయి పాపన్న నడయాడిన నేల సర్వాయిపేట గ్రామ ప్రాంతం ఇక పర్యాటక కేంద్రంగా మారనుంది. సర్వాయి పాపన్న గుట్టలను, ఆ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా చేసేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో తెలంగాణ ప్రభుత్వం రూ. 4.32 కోట్ల నిధులు విడుదల చేసింది. దాంతో పాపన్న గుట్ల వద్ద ఇదివరకు ఉన్న పాపన్న విగ్రహం కాకుండా ఓ కొత్త భారీ విగ్రహం నిర్మిస్తున్నారు. అలాగే గుట్టపైకి మెట్ల మార్గం నిర్మించడంతో పాటు మరిన్ని అభివృద్ధి


సర్వాయిపేటలో ఉన్న పాపన్న కోట ముఖద్వారం

పనులు చేస్తున్నారు. అయితే ఈ పనులు పూర్తయితే ఈ నెల 18న పాపన్న జయంతి రోజున విగ్రహంతో పాటు, మెట్ల మార్గాన్ని ప్రారంభించే అవకాశముంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సర్వాయిపేట ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని, అప్పటి పీసీసీ అధ్యక్ష హోదాలో పాదయాత్రలో భాగంగా సర్వాయిపేటకు వచ్చినప్పుడు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు నిధులు విడుదల చేశారు.


సర్వాయిపేట కొమ్ముగుట్ట వద్ద నిర్మిస్తున్న పాపన్న భారీ విగ్రహం

అధికారికంగా పాపన్న జయంతి నిర్వహించాలి

సర్వాయి పాపన్న చాలా సంవత్సరాలు సర్వాయి పేట ప్రాంతంలో నివసించాడని, ఈ ప్రాంతంలో ఉండి అనగారిన వర్గాల కోసం పోరాటం చేశాడని, ఈ పాపన్న గుట్టల వద్ద ప్రభుత్వం అధికారికంగా పాపన్న జయంతి నిర్వహించాలని మండల ప్రజలు, వివిధ కుల సంఘాల నాయకులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో అనేక పాపన్న అనవాళ్లు ఉన్నాయని చెపుతున్నారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో పాపన్న ఆనవాళ్లతో మ్యూజియం ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. అంతేగాక పార్క్, తారురోడ్ల నిర్మాణం, మంచినీటి సౌకర్యం, కొలను, ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సర్వాయిపేటలో పాపన్న ఆనవాళ్లు

పార్వాయిపేటలో శత్రువుల నుంచి రక్షణ కోసం పాపన్న నిర్మించుకున్న కోటలు, బురుజు, ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. కానీ దెబ్బతినే అవకాశముందని వాటిని మరమ్మతు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో పాపన్న గుర్తులుగా కోటగిరి గట్టు, గొలుసుకట్టు చెరువులు, గుట్టలు, పాపన్న చెరువు, గుట్టపై పాపన్న ఆనవాళ్లు ఉన్నాయి. ఈ ప్రాంతం పర్యాటకులను ఆకర్షించే అవకాశముంది.


గుట్టపైకి వేస్తున్న మెట్ల మార్గం

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థులు


శివకుమార్, శీలం శ్రీహర్ష

శంకరపట్నం/సైదాపూర్/మల్యాల/బీర్‌పూర్/జగిత్యాలరూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, జగిత్యాల జిల్లాల నుంచి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. శంకరపట్నం మండలం కేశవపట్నం ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు సానియా, ఆదిదుర్గ, సైదాపూర్ మండంలోని ఆకునూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ముగ్గురు విద్యార్థులు బొడిగె లహరి, మండల ప్రగతి, పెద్ది సాత్విక రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎంలు సుభాష్, రామస్వామి తెలిపారు. మల్యాల జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఈ శివకుమార్ అనే విద్యార్థి, బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ జిల్లా పరిషత్ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి శీలం శ్రీహర్ష, జగిత్యాల రూరల్ మండలం చల్గల్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులు గమ్య, గీతిక రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల హెచ్ఎంలు అనుపమ, భాస్కర్ రెడ్డి, లతాదేవి తెలిపారు.

పరిశోధన పత్రాలతో పుస్తకం.. ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బండి సంజయ్

గణేశ్‌నగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల కామర్స్ విభాగం జాతీయ సదస్సుకు సంబంధించిన ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ చాలెంజెస్ ఇన్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అనే పుస్తకాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆదివారం కరీంనగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ సాంకేతికతో వ్యాపార వాణిజ్య, బ్యాంకింగ్, బీమా రంగాల్లో అనేక మార్పులు సంభవిస్తున్నాయని, వాటిపై పరిశోధన పత్రాలను పుస్తక రూపంలో ప్రచురించడం అభినందనీయమని అన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ, సమన్వయకర్త డాక్టర్ మల్లారెడ్డి మాట్లా డుతూ ఇటీవల ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ అటానమస్ కళాశాల కామర్స్ విభాగం ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ చాలెంజెస్ ఇన్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో సమర్పించిన 45 పరిశోధన పత్రాలను ఈపుస్తకంలో ప్రచురించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నితిన్, రాజయ్య, టీజీసీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ దుష్ప్రచారం

» మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

కరీంనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని, అధికారం కోసం దేశభద్రతనే పణంగా పెట్టడం మంచి పద్ధతి కాదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో గెలిచింది కాంగ్రెస్ పార్టీయే కదా. ఇక్కడ కూడా ఈవీఎం మిషన్లతోనే ఎన్నికలు జరిగాయి. మీరు గెలిస్తే మిషన్లు పనిచేసినట్లు, ఎలక్షన్ కమిషన్ పనిచేసినట్లా. ఓడిపోతే ఎలక్షన్ కమిషన్ పనిచేయనట్లా' అని ప్రశ్నించారు. ఓట్ల చోరీ జరిగినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని, ఇదెక్కడి దిక్కుమాలిన ఆలోచన అని అన్నారు. హైదరాబాద్‌లో అద్దెకు ఉండేవాళ్లు ఒక ప్రాతం నుంచి ఇంకో ప్రాంతానికి మారుతూ ఉంటారని, ఊరు నుంచి పట్టణాలకు వలస వస్తూ ఉంటారని అన్నారు. వారి ఓట్లను సరి చేయాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్ మీద ఉంటుందని, ఓట్ల నమోదు, డబుల్ ఓట్ల తొలగించే విధానం నిరంతర ప్రక్రియ అని అన్నారు. బీహార్ బోర్డర్ ఉన్న ప్రాంతం, ఇక్కడికి బంగ్లాదేశ్ ఇతర ప్రాంతాల నుంచి వచ్చే అవకాశం ఉందని, అలా వచ్చినవారికి ఆధార్ కార్డులు, సిటిజన్‌షిప్ ఇవ్వడం ఎంత మాత్రం దేశానికి క్షేమం కాదని అన్నారు. ఓట్ల కోసం అధికారం కోసం దేశ భద్రతనే పణంగా పెడతా అంటే మంచి పద్ధతి కాదన్నారు. ఇలాంటి చవకబారు ఆరోపణలు సరికాదని, ఎన్నికల కమిషనర్ స్వతంత్ర సంస్థ అని అన్నారు. సుప్రీంకోర్టు కూడా కొన్ని ఆదేశాలు జారీ చేసిందని, దాని ప్రకారం నిర్ణయాలు ఉంటాయి తప్ప పార్టీకి, ప్రభుత్వానికి ఏం సంబంధం ఉంటుందని ప్రశించారు. ఆ మాత్రం అవగాహన లేకపోతే ఎలా అన్నారు.

ఆలయాలకు శ్రావణ శోభ

» వేములవాడ, ధర్మపురిలో భక్తుల రద్దీ


భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. శ్రావణ మాసం ఆదివారాన్ని పురస్కరించకుని రాజన్న ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి, కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో బారులు తీరారు. సుమారుగా రెండు గంటలపాటు కోడెమొక్కు టికెట్‌ల కోసం భక్తులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్ దర్శనం క్యూలైన్ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని పార్వతిరాజరా జేశ్వర స్వామివారలను దర్శించుకున్నారు. కుంకుమ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భీమేశ్వరస్వామి, బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. నాంపల్లి లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. సమీప గ్రామాల ప్రజలు స్వామివారికి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ వేదపండితులు, అర్చకులు స్వామి వారలకు పంచోపనిషత్తులతో అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు, తీర్థప్రసాద వితరణ జరిపారు. భక్తులు అభిషేకం, కుంకుమార్చన, స్వామివారల నిత్యకల్యాణం, నరసింహ హోమం జరిపించారు.

ఘనంగా ఏకాదశ రుద్రాభిషేకం

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామి అనుబంధ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం హారతి, మంత్రపుష్పం, తీర్థ, ప్రసాదాల వితరణ జరిపారు. అనేక మంది భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.


ఏకాదశ రుద్రాభిషేకంలో పాల్గొన్న వేదపండితులు

శ్రీరాంసాగర్‌కు భారీగా వరద

- 1,51,806 క్యూసెక్కుల నీరు రాక


వరద కాలువలో ప్రవహిస్తున్న ఎస్సారెస్పీ నీరు

జగిత్యాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం వరద నీరు రావడం భారీగా పెరిగింది. డ్యామ్‌లోకి 1,51,806 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. రాత్రికి క్రమంగా ఇన్‌ఫ్లో 1,42,905 క్యూసెక్కులకు తగ్గినా ఒకటి రెండు రోజుల్లో ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటుందని అధికారులు అంటున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడం, విష్ణుపురి పరివాహక ప్రాంతం నుంచి గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీల సామర్థ్యంకు గానూ ప్రస్తుతం 68.431 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

వరద కాలువకు నీరు విడుదల..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఇందిరమ్మ వరద కాలువకు ఆదివారం ఉదయం 11.30 గంటలకు హెడ్ రెగ్యులేటరీ ద్వారా నీటి విడుదలను చేశారు. ముందుగా 3,000 క్యూసెక్కుల నీటిని వరద కాలువకు విడుదల చేసినప్పటికీ కొద్దికొద్దిగా పెంచుతూ మధ్యాహ్నం ఒంటి గంట వరకు 4,000 క్యూసెక్కులు, సాయంత్రం ఐదు గంటల వరకు 10,000 క్యూసెక్కులకు నీటి విడుదలను పెంచారు. నిజామాబాద్ జిల్లా కమ్మరిపల్లి మండలం నాగాపూర్ వద్ద వరద కాలువ టాప్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదిలారు. పలు ప్రాంతాల్లో గల వరద కాలువలో భారీగా నీరు ప్రవహిస్తోంది.

గంగాధర: వరద కాలువకు విడుదల చేసిన శ్రీరాంసాగర్ నీరు ఆదివారం గంగాధర మండలం మీదుగా మిడ్‌మానేరుకు నీరు చేరుతోంది. మరోవైపు మూడు రోజులు రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపు హౌజ్ నుంచి నాలుగు మోటర్లతో కాళేశ్వరం నీరును వరదకాలువకు విడుదల చేశారు. శ్రీరాంసాగర్, గాయత్రీ పంపు నీరుతో వరదకాలువ నిండుకుండలా ప్రవహిస్తోంది.

లింకు కాలువకు నీరు నిలుపుదల..

ర్యాలపల్లి వరద కాలుపై ఏర్పాటు చేసిన లింకు కాలువకు నీరును నిలిపివేశారు. రెండురోజులుగా ర్యాలపల్లి వరద కాలువ నుంచి మల్యాల మండలం తాటిపల్లి కాకతీయ కాలువకు 900 క్యూసెక్కుల నీరును విడుదల చేశారు. శ్రీరాంసాగర్ నీరు విడుదల చేయడంతో లింకు కాలువ గేట్లు మూసివేశారు.

గాయత్రి పంపుహౌజ్ నుంచి..


గాయత్రి పంపుహౌజ్ నుంచి ప్రవహిస్తున్న నీరు

రామడుగు: రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌజ్ నుంచి మిడ్ మానేరుకు నీటి విడుదల కొనసాగుతోంది. ఆదివారం నాలుగు పంపుల ద్వారా గ్రావిటీ కెనాల్‌కు నీటిని విడుదల చేయగా నేరుగా వరద కాలువ ద్వారా మానేరుకు చేరుతోంది. నాలుగు పంపుల ద్వారా 12,600 క్యూసెక్కుల నీరు తరలివెళ్తుండగా కాలువ నిండుగా కనిపిస్తోంది. ప్రస్తుతం పై నుంచి వస్తున్న వరద నేపథ్యంలో నాలుగు పంపులు ఆన్ చేసిన అధికారులు ఐదవ పంపు కూడా రన్ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

మిడ్ మానేరులో పది టీఎంసీలు..

బోయినపల్లి: మండలంలోని శ్రీరాజరాజేశ్వర జలాశయానికి ఎల్లంపల్లి జలాల ఎత్తిపోతలతో పాటు మూలవాగు, మానేరు ద్వారా నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లోకి ఆదివారం సాయంత్రం వరకు 9,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరుతోంది. గాయత్రి పంప్ హౌస్ నుంచి 9,300 క్యూసెక్కులు, మూలవాగు, మానేరు వాగు ద్వారా మరో 110 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోందని ప్రాజెక్ట్ డీఈ రాజు తెలిపారు. ప్రాజెక్ట్ నీటి నిల్వసామర్థ్యం, 27.55 టీఎంసీలకు గాను 10.984 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

28 ఫీట్లకు చేరిన ఎగువ మానేరు..

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయం నీటి మట్టం 28 ఫీట్లకు చేరింది. ఎగువన రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కామారెడ్డి జిల్లాలోని పల్వంచ వాగు పొంగి పొర్లుతోంది. దీంతో మానేరు జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మొత్తం 31 ఫీట్ల నీటి సామర్థ్యం ఉన్న మానేరు ప్రస్తుతం 28 ఫీట్లకు చేరింది. మత్తడి దూకేందుకు మరో మూడు ఫీట్ల నీరు అవసరం ఉంది.

ఎల్లంపల్లికి కొనసాగుతున్న వరద

అంతర్గాం: అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 5,300 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలకుగాను 18.536 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్ట్ నుంచి నంది పంప్‌హౌజ్‌కు 12,600 క్యూసెక్కులు, ఎన్‌టీపీసీకి 121క్యూసెక్కులు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్‌కి 295క్యూసెక్కుల నీటి ఔట్ ఫ్లో కొనసాగుతోంది.

సుందిళ్ల బ్యారేజీకి..


సుందిళ్ల బ్యారేజీ నుంచి దిగువకు వెళ్తున్న నీరు

మంథనిరూరల్: భారీ వర్షాలు, ఎగువ నుంచి వరద నీరు రావడంతో మంథని మండలంలోని సిరిపురం వద్ద ఉన్న సుందిళ్ల బ్యారేజీలోకి ఆదివారం ఉదయం వరకు లక్షా 63 వేల 241క్యూసెకుల నీరు వచ్చి చేరింది. బ్యారేజీలో 74గేట్లు ఎత్తి ఉండటంతో నీరు దిగువకు వెళుతోంది. దిగువ ప్రాంతంలో ఉన్న ఉప్పట్ల, పోతారం, విలోచవరం, మంథని, ఖానాపూర్, ఖాన్‌సాయిపేట, ఆరెంద గ్రామల వరకు గోదావరిలో నీటి మట్టం పెరిగింది. మరో వైపు మానేరు నదిలో నీటి ప్రవహం పెరిగింది.

నిలకడగా గోదావరి ప్రవాహం ..

ధర్మపురి: ధర్మపురి పట్టణంలో గోదావరి నది వరద ఆదివారం నికకడగా కొనసాగింది. గోదావరి ఎగువ ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండి వాగుల ద్వారా ప్రవహిస్తున్న నీరు నదిలో చేరుతుంది. దీనికి తోడుగా నిర్మల్ జిల్లా కడెం-నారాయణరెడ్డి ప్రాజెక్టు లోనికి భారీగా వరద నీరు చేరింది. ప్రాజెక్టు ఆరు గేట్లు ఎత్తి అధికారులు దిగువ గోదావరి నదిలోకి నీరు విడుదల చేశారు. తర్వాత గేట్లు మొత్తం మూసి వేసి ఉంచారు.

నేడు జేఎన్‌టీయూలో అవగాహన కార్యక్రమం

కొడిమ్యాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూలో సోమవారం బీటెక్ మొదటి సంవత్సరం 2025 విద్యార్థులకు (స్వయం ప్రతిపత్తి) అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విశ్వనాథ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు వివిధ విభాగాల అధిపతులు కళాశాల విద్యావిధానం, సదుపాయాలను గురించి అవగాహన కలిపిస్తారన్నారు. కార్యక్రమానికి ఎస్పీ అశోక్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి కిషన్‌కుమార్ రెడ్డి, రెక్టార్ డాక్టర్ కె విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె వెంకటేశ్వర్‌రావు ఓరియెంటేషన్ కార్యక్రమానికి ఆన్‌లైన్‌లో హాజరవుతారని ప్రిన్సిపాల్ తెలిపారు.

దొనూర్ ఆలయంలో వరద పాశం


వరదపాశం నిర్వహిస్తున్న భక్తులు

ధర్మపురి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని దొనూర్ లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో ఏఎంసీ వైస్ చైర్మన్ సంగ నర్సింహులు ఆధ్వర్యంలో వరద పాశం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు చెందిన పంట పొలాలు మంచిగా పండాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ స్వామి వారిని వేడుకున్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని, వర్షాలు విస్తారంగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ధర్మపురి ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య, ధర్మకర్త బొల్లారపు పోచయ్య, మాజీ సర్పంచ్ జంగిలి ప్రభాకర్, గంధం రమేష్, పోడేటి తిరుపతి, పల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు.

జానపదం.. అతని ప్రాణం..

- ఓసీపీ-3లో ఈపీ ఫిట్టర్‌గా విధులు
- గానం, నృత్యంలో రాణింపు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రశంసలందుకుంటున్న రమణయ్య

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్ళ వయస్సులో పాఠశాలలో పాటల పోటీల్లో వచ్చిన ప్రైజ్‌లు... చప్పట్లు సంతోషపడేలా చేశాయి... వాటికి తోడు తల్లిదండ్రులిద్దరూ జానపద కళాకారులు కావడం వారి ప్రోత్సాహంతో జానపద గానాలు, నృత్యాలపై పెంచుకున్న మక్కువే అతనికి ప్రాణమయ్యాయి... రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి ప్రశంసలందుకునేలా చేశాయి... అతనే కనకం రమణయ్య..

కళాకారులకు...గని కార్మికులకు నిలయమైన గోదావరిఖనికి చెందిన కనకం రమణయ్య జానపద గాయకుడిగా, నృత్య కళాకారుడిగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నాడు. వృత్తి రీత్యా సింగరేణి ఓసిపి-3లో ఈపీ ఫిట్టర్‌గా పని చేస్తున్నాడు.



మలేషియాలో జరిగిన సాంస్కృతిక పోటీల్లో పాట పాడుతున్న రమణయ్య(ఫైల్)

సింగరేణిలో పనిచేస్తూ జానపదంపై ఉన్న ఇష్టంతో ఇప్పటికీ పలు పోటీల్లో పాల్గొంటూ బహుమతులు, అవార్డులు అందుకుంటున్నాడు. ఎనిమిదేళ్ల వయస్సులో చదువుకున్న పాఠశాలలో జరిగిన పోటీలలో పాడిన పాటలకు బహుమతులు రావడంతో కలిగిన సంతోషమే కళా రంగంపై దృష్టి సారించేలా చేసింది. దానికి తోడు తల్లిదండ్రులిద్దరు కళాకారులు కావడంతో మరింత ప్రోత్సాహం లభించింది. పాటలలో గురువు తల్లి బాలమ్మ కాగా, డప్పు నృత్యంలో తండ్రి అంకూస్ నుంచి పునికి పుచ్చుకొని జానపద నృత్యంలో నర్సింగరావు వద్ద శిష్యరికం పొందాడు. చిన్ననాటి నుంచి రమణయ్య పాల్గొన్న ప్రతీ పోటీల్లో బహుమతులు రావడం, పలువురి ప్రశంసలందుకుంటూనే ఉన్నాడు. సింగరేణి సంస్థ పరంగా జరిగే కోలిండియా స్థాయి సాంస్కృతిక పోటీల్లో పాల్గొని సంస్థ కీర్తిని చాటాడు. అంతేకాకుండా పలు నాటకాల్లో నటించి శభాష్ అనిపించుకో వడంతోపాటు 'గోదారి గల గలలు', 'సింగరేణి స్వరాలు", జై వీరాంజనేయ ఆడియో పాటల క్యాసెట్లతో ఆలపించాడు. పలు సామాజిక కార్యక్రమాల్లో కూడా రమణయ్య, నృత్యంతో చైతన్య పరిచాడు. 2009లో మలేషియా తెలుగు ఎక్స్‌పో దీపావళి సంబరాలలో జానపద గాయకుడిగా పాల్గొని అక్కడి తెలుగు వారి ప్రశంసలు పొందాడు. మూడున్నర దశాబ్దాలుగా అటు సింగరేణి సంస్థలో కార్మికుడిగా పనిచేస్తూనే జానపద కళాకారుడిగా ప్రదర్శనలిస్తూ


సినీ నటుడు నూతన్‌ప్రసాద్ చేతుల మీదుగా బహుమతి తీసుకున్న రమణయ్య(ఫైల్)

గోదావరి కళా సంఘాల సమాఖ్యకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు రమణయ్య.

గోదావరి కళా సంఘాల సమాఖ్యతో ఉనికి..

గోదావరి కళా సంఘాల సమాఖ్యకు అధ్యక్షుడిగా కనకం రమణయ్య ఈ ప్రాంతంలో కళాకారుల, కళల ఉనికిని చాటుతున్నాడు. అందరితో కలిసి సమిష్టిగా ముందుకు వెళుతూ కళాకారులకు అభినందన కార్యక్రమాలు, ఉత్సవాలు చేస్తూ ఈ ప్రాంతంలో కళలు, కళాకారుల సంక్షేమానికి తన వంతు పాత్రను పోషిస్తున్నాడు రమణయ్య. ఈ ప్రాంతంలో కళాకారుల కోసం కళాభవన్ నిర్మించాలనేదే తన లక్ష్యమని పేర్కొన్నాడు.

పేదలకు సీఎంఆర్‌ఎఫ్ అండ



చెక్కులు అందజేస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎమ్మార్‌ఎఫ్ అండగా నిలుస్తోందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ముకరంపురలోని నగర కాంగ్రెస్ కార్యాలయంలో రూ.5లక్షల 30వేల విలువైన సీఎమ్మార్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతీ ఒక్కరికి ఏదో ఒక రూపంలో సహాయం అందుతుందని, ఇందిరమ్మ రాజ్యం అంటే ఈ విధంగా ఉంటుందని అన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ కరీంనగర్ నియోజకవర్గ ప్రజలకు ఎంతో ఉపయోగ పడుతోందన్నారు. శ్రవణ్ నాయక్, మూల రవీందర్‌రెడ్డి, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, షబానా మహమ్మద్, నదీమ్, మాసుం ఖాన్ పాల్గొన్నారు.

విరబూసిన 'బ్రహ్మ కమలం'



కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): 'బ్రహ్మ కమలం' పూలకు ప్రత్యేకత ఉంది. ఈ పూలు ఎక్కువగా రాత్రి విరబూస్తాయి. మొక్క ఆకుకు మాత్రమే పూస్తాయి. అరుదుగా కనిపించే ఈ పూలు నగర శివారులోని తీగలగుట్టపల్లిలో ప్రైవేట్ టీచర్ మధు స్వాతి ఇంట్లో కనువిందు చేస్తున్నాయి.

బీఆర్‌ఎస్ కక్కుర్తితో గుదిబండగా కాళేశ్వరం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పులి ఆంజనేయులు

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ కమిషన్ల కక్కుర్తితో కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ ప్రజలకు గుదిబండగా మారిందని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, బీసీసెల్ జిల్లా చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ ఆరోపించారు. ఆదివారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎంపీ వినోద్ కుమార్ చొప్పదండి నియోజకవర్గంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంపు హౌస్ సందర్శనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డిపై, కాంగ్రెస్‌పై చేసిన విమర్శలను ఖండించారు. కంటికి కనిపించే గాయత్రి పంప్‌హౌస్ నీరు మాత్రమే చూపించిన వినోద్ కుమార్‌కు దాంతో తెలంగాణ ప్రజలపై ఎంత భారం పడుతుందో తెలియదా? అని ప్రశ్నించారు. కాగ్ నివేదిక ప్రకారం 81వేల 9వందల 11కోట్ల రూపాయలతో నిర్మించాల్సిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను, అది పూర్తి అయ్యేసరికి ఒక లక్ష 47 వేల కోట్ల రూపాయల ఖర్చయ్యిందని వినోద్ కుమార్‌కు తెలియదా అన్నారు. కేవలం కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన మోటార్లు ఆన్ చేస్తే ఒకరోజు మొత్తం తెలంగాణ ప్రజలు వినియోగించే విద్యుత్ వినియోగంతో సమానమన్నారు. ఈ సమావేశంలో నాయకులు రామిడి రాజిరెడ్డి, వంగల విద్యాసాగర్, కంకణాల అనిల్ కుమార్, నూనె గోపాల్ రెడ్డి, నెల్లి నరేష్, సయ్యద్ జమాలుద్దీన్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఈతలో నాలుగు గొర్రె పిల్లలు



నాలుగు పిల్లలకు జన్మనిచ్చిన గొర్రె

గన్నేరువరం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గొర్రె సాధారణంగా రెండు లేదా మూడు పిల్లలకు జన్మనిస్తుంది. మండల కేంద్రంలోని గొర్రెల కాపరి ముడికె ఎల్లయ్యకు చెందిన గొర్రె మొదటి కాన్పులో నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. వాటిలో మూడు ఆడ, ఒక మగ పిల్ల ఉన్నాయి. అవి ఆరోగ్యంగా ఉన్నాయని గొర్లకాపరి ఎల్లయ్య తెలిపాడు. .

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సన్మానం



ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న వెలిచాల రాజేందర్‌రావు

భగత్‌నగర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని వెలిచాల ప్రజాకార్యాలయాన్ని ఆదివారం సందర్శించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు సన్మానించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. రాబోయే మున్సిపల్, స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వివరించారు. పార్టీ యంత్రాంగాన్ని అన్ని విధాల సమాయత్తం చేస్తున్నామన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్‌ను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఖాయమన్నారు.

బొడిగె శోభ కుమారుడి వివాహ వేడుకలో బీజేపీ నేతలు



హాజరైన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

భగత్‌నగర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని తీగలగుట్టపల్లిలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో జరిగిన చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ కుమారుడి వివాహానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, మాజీ మంత్రి, మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్‌రావు, కొలగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల శ్రమదానం



శ్రమదానం చేస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మకల్ 6వ డివిజన్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం శ్రమదానం చేపట్టారు. బొమ్మకల్ బైపాస్ రోడ్‌లో లారీ అసోసియేషన్ వద్ద స్టాపర్లను ఏర్పాటు చేసి రోడ్డుకిరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. ఇటీవల వర్షాలకు రోడ్డుపై పడిన గుంతలను మట్టితో నింపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఈస్ట్‌జోన్ అధ్యక్షులు అవుదుర్తి శ్రీనివాస్, రైల్వే బోర్డు మెంబర్ పాశం తిరుపతి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిందం అశోక్, నాయకులు అసిరి తిరుపతి, కాల్వ రామచంద్రం, గాలిపెల్లి నారాయణ, పెద్ది లక్ష్మణ్, మెర్గవేని శ్రీకాంత్, కాల్వ శ్రీకాంత్, నేరెళ్ల శశి, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

పెరిక కులస్తుల వన భోజనాలు

తిమ్మాపూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మక్తపల్లిలో పురగిరి క్షత్రియ పెరిక సంఘం సభ్యులు ఆదివారం వనభోజనాలు నిర్వహించారు. నల్లగొండలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ఆవరణలో చిన్నారులు, మహిళలు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. చివరగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రాజెక్టులకు జలకళ

(5వ పేజీ తరువాయి)

కారణంగా శనివారం ఎల్లంపల్లి గేట్లు ఎత్తి దిగువకు 2 లక్షల క్యూసెక్కుల నీటిని వదిలేశారు. ఇప్పుడు ఎగువన వరద ప్రవాహం తగ్గడంతో ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి గేట్లు మూసివేసి నీటి విడుదలను ఆపేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ప్రస్తుతం 13,016 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా 12,600 క్యూసెక్కుల నీటిని నంది పంపుహౌజ్ ద్వారా మిడ్ మానేరుకు తరలిస్తున్నారు. మిడ్ మానేరులో 27.55 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి 10.98 టీఎంసీల నీరు వచ్చి చేరింది. నంది పంపుహౌజ్ నుంచి ఈ ప్రాజెక్టుకు 9,500 క్యూసెక్కుల నీరు వస్తున్నది. ఆదివారం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా వరద కాలువకు 10 వేల క్యూసెక్కుల నీరు వదిలారు. వరద కాలువ ద్వారా ఈ నీరు సోమవారానికి మిడ్ మానేరు చేరే అవకాశం ఉన్నది. శ్రీరాంసాగర్ ఎగువన వరద ప్రవాహం ప్రస్తుతం మాదిరిగానే కొనసాగితే వరద కాలువ ద్వారా వదిలే నీరు అలాగే ఎల్లంపల్లి ద్వారా వచ్చే నీటితో మధ్య మానేరు త్వరలోనే నిండే అవకాశం కలుగుతుంది.

● ఎల్‌ఎండీలో 7.29 టీఎంసీల నీరు

జిల్లా కేంద్రాన్ని ఆనుకుని ఉన్న ఎల్‌ఎండీలో నీటి నిల్వ సామర్థ్యం 24.03 టీఎంసీలు కాగా ప్రస్తుతం కేవలం 7.29 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నది. మరో 17 టీఎంసీల నీరు వస్తే ఎల్‌ఎండీ గేట్లు ఎత్తే అవకాశం ఉన్నది. కాకతీయ కాలువ ద్వారా కేవలం 682 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే ప్రాజెక్టులోకి వస్తున్నది. క్యాచ్‌మెంట్ ఏరియాలో భారీ వర్షాలు లేక మోయతుమ్మెద వాగు నుంచి పెద్దగా నీరు రాకపోవడంతో ఎల్‌ఎండీలోకి నీరు రావడం లేదు. ఎల్లంపల్లి, వరద కాలువల ద్వారా వచ్చే వరదతో మిడ్ మానేరు నిండితే, మిడ్‌మానేరుకు ఎగువన క్యాచ్‌మెంట్ ఏరియాలో భారీ వర్షాలు కురిసి మానేరు పొంగితే అది నిండి గేట్లు ఎత్తడం ద్వారా ఎల్‌ఎండీకి జలకళ రానున్నది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, గత నెలలో కురిసిన వర్షాల కారణంగా ప్రాజెక్టుల్లోకి నీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టుల ఆయకట్టు రైతులకు వానాకాలం సాగుపై ఆశలు పెరిగాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రేపటికి నిండే అవకాశం ఉండడంతో ప్రాజెక్టు ఆయ కట్టుకు ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలకు ఢోకా లేని పరిస్థితి ఏర్పడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో వారం రోజులపాటు భారీ వర్షాలు కొనసాగితే ప్రాజెక్టులే కాకుండా చెరువులు, కుంటలు అన్నీ నిండి భూగర్భజలాలు పెరిగి జిల్లాలో ఉన్న ప్రతి ఎకరా సాగయ్యే అవకాశాలు ఉన్నాయి.

కులమతాలకు అతీతంగా స్వాతంత్ర్య ఉద్యమం



మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కులమతాలకు సంబంధం లేకుండా కలిసికట్టుగా పోరాటం చేశామని, అనంతరం దేశ అభివృద్ధిలో భాగస్వాములమయ్యామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక ఐబీఏ గార్డెన్‌లో అంజుమన్ తరఖీ ఉర్దూ కరీంనగర్ ఆధ్వర్యంలో ముషాయిరా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని మత తత్వశక్తులు మన అనుబంధాన్ని విడదీయాలని, తద్వారా లాభం పొందాలని చూస్తున్నాయని అన్నారు. ముషాయిరా కార్యక్రమాలు దేశ భక్తిని పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ తరఖీ ఉర్దూ కరీంనగర్ అధ్యక్ష కార్యదర్శులు సర్వర్ బియాబాని, సమద్ నవాబ్, సిరాజ్ మసూద్, సాదిక్ అలీ, అసద్, సాదత్ అలీ, ఇజ్‌హార్ తదితరులు పాల్గొన్నారు.

ఇతిహాసాలే మన సంస్కృతికి మూలం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సభ్యులు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : రామాయణ, భారత, భాగవతాల వంటి ఇతిహాసాలే దేశ సంస్కృతికి మూలమని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎన్‌రావు అన్నారు. తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఫిలింభవన్‌లో అవంచ ప్రమోద్ రచించిన 'మేలిమి చింత' పుస్తక పరిచయ సభలో మాట్లాడారు. వాక్యం రసాత్మకం కావాలంటే భాష, శైలి ముఖ్యమని, కవిత్వాన్ని సొంత అభివ్యక్తితో శ్రమతో సాధించాలని అన్నారు. ఫిజీషియన్ డాక్టర్ విజయమోహన్‌రెడ్డి మాట్లాడుతూ సమాజాన్ని ఉన్నతీకరించే ఉత్తమ సాధనం కవిత్వమన్నారు. కందుకూరి అంజయ్య పుస్తక పరిచయం చేశారు. ఇటీవల మరణించిన వరంగల్‌కు చెందిన రచయిత్రి అనిశెట్టి రజితకు నివాళులర్పించారు. రచయిత ప్రమోద్‌ను సన్మానించారు. డాక్టర్ విజయకుమార్, కనకం శ్రీనివాస్ సమన్వయ కర్తలుగా వ్యవహరించారు. తెరవే అధ్యక్షుడు సీవీ కుమార్, ప్రధానకార్యదర్శి దామరకుంట శంకరయ్య, డాక్టర్ రఘురామన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ బూర్ల వేంకటేశ్వర్లు, అన్నవరం దేవేందర్, గులాబీల మల్లారెడ్డి, గాజోజు నాగభూషణం, కూకట్ల తిరుపతి, నగునూరి శేఖర్, పీఎస్ రవీంద్ర, కవులు, రచయితలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు వింధ్యావాలి విద్యార్థి



అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో సోమ, మంగళవారాల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్-15 బాలబాలికల ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ వింధ్యావాలి ఉన్నత పాఠశాల విద్యార్థి ముచ అభిరాంరెడ్డి ఎంపికయ్యాడు. ఈ నెల 16న జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీల్లో అభిరామ్‌రెడ్డి ప్రతిభ చాటాడు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభిరామ్‌రెడ్డిని ప్రిన్సిపాల్ ప్రశాంత్ అభినందించారు. పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

జమ్మికుంట ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని విజడమ్ జూనియర్ కళాశాలలో 2001-03లో సీఈసీ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 22 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ప్రిన్సిపాల్ విజేందర్ రెడ్డి, కరస్పాండెంట్ రవీందర్, డైరెక్టర్ ప్రభాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చదరంగం పోటీలకు విశేష స్పందన

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ భగత్‌నగర్‌లోని జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ర్యాంకింగ్ చదరంగం పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొని వారి మేధాశక్తిని చాటుకున్నారు. విజేతలకు రిటైర్డ్ ఆర్మీ మహిపాల్ రెడ్డి బహుమతులు అందజేశారు. అకాడమీ వ్యవస్థాపకుడు కంకటి కనకయ్య, టోర్నమెంట్ ఆర్గనైజర్, సీనియర్ కోచ్ కంకటి అనూప్ కుమార్, డెమోక్రసీ అసోసియేషన్ కార్యదర్శులు సృజన్ కుమార్, తాటిపల్లి సతీష్‌బాబు, చీఫ్ ఆర్బిటర్ అరుణ్, చదరంగం కోచ్‌లు అభిరామ్, ప్రభుచంద్ర, నితిన్, శ్రీనిజ పాల్గొన్నారు.

ఏఐసీసీ ఎస్సీ సెల్ చైర్మన్‌ను కలిసిన సారంగపాణి



రాజేంద్రపాల్ గౌతమ్‌తో సారంగపాణి

ఇల్లందకుంట, ఆగస్టు 17 (ఆంధ్ర జ్యోతి): ఏఐసీసీ ఎస్సీ సెల్ డిపార్ట్ మెంట్ చైర్మన్ రాజేంద్రపాల్ గౌతమ్‌ను కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడెపు సారంగ పాణి ఆదివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సారంగపాణి శాలువాతో సత్క రించారు. అనంతరం పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా రవీందర్

హుజూరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా మార్త రవీందర్ ఎన్నికయ్యారు. ఆదివారం హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లావర్కింగ్ అధ్యక్షుడు చారి మాట్లాడుతూ ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల సమస్యలను రాష్ట్రప్రభుత్వం వెంటనే పరిష్క రించాలన్నారు. కార్యక్రమంలో పేరాల లక్ష్మణరావు, ఈవీఆర్ నర్సయ్య, బాపురెడ్డి, రాజమౌళి, రఘుపతి, గంగరాజు, కనకయ్య, పండరి, ఉపేందర్, స్వామి, మొగిలి, కేపీరెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు గుండి వేణుగోపాలస్వామి కల్యాణం



ముస్తాబైన ఆలయం

రామడుగు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండి వేణుగోపాలస్వామి దేవాలయం స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవానికి ముస్తాబయింది. మంగళ వారం రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగో పాలస్వామి కల్యా ణాన్ని కన్నులపండువగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 8:30గంటలకు విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవచనము, కల్యాణోత్సవం, అనంతరం తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిం చనున్నారు. సాయంత్రం 7గంటలకు వేణు గోపాలస్వామి సహస్ర నామాలతో పుష్పా లంకరణ, విష్ణు సహస్రనామ పారాయణం, పవలింపు సేవ జరుగు తుందని ఆలయ కమిటీసభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూపాక అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా గిన్నారపు మహేందర్, ఉపాధ్యక్షుడిగా గురుకుంట్ల రాజు, కోశాధికారిగా ఇల్లందుల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా ఇల్లందుల వెంకటేష్, కార్యదర్శిగా ఇల్లందుల చందు, గౌరవ అధ్యక్షులుగా ఇల్లందుల రమేష్, మునిగాల సారయ్య, కార్యవర్గ సభ్యులుగా గురుకుంట్ల తిరుపతి, శ్రీకాంత్, మహేష్, రాజేష్,

బీసీలకే అవకాశం ఇవ్వాలి



మాట్లాడుతున్న శ్రీధర్‌రాజు

గణేశ్‌నగర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జిగా బీసీలకే అవకాశం ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్‌రాజు అన్నారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన బీసీ సంఘాల సమావేశంలో మాట్లాడారు. గతంలో నియోజకవర్గం అగ్రవర్ణాల ఆధిపత్యంలో ఉండేదని, ఇటీవల నాలుగు పర్యాయాలుగా బీసీలు ఏకమై బీసీ అభ్యర్థులను గెలిపించుకుంటున్నారన్నారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు టికెట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇతర వర్గాలకు కేటాయిస్తే బీసీల మనోభావాలను దెబ్బతీసినట్లవుతుందని, బీసీలందరూ పార్టీకి వ్యతిరేకమవుతారని అన్నారు. నాయకులు రవీంద్రాచారి, సత్యనారాయణ, జగన్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జమ్మికుంట రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం జగ్గయ్యపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పొనగంటి బాపురావు తండ్రి మధునారావు ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని ఆదివారం హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సతీష్ రెడ్డి, డైరెక్టర్ నాయినేని రాజేశ్వర్,పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్, నాయకులు రాజు, కోటి, అజయ్, రవి, లింగయ్య, తదితరులున్నారు.

సైక్లింగ్‌తో పర్యావరణ పరిరక్షణ



విద్యార్థులతో జిల్లా సైక్లింగ్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ మధుసూదన్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జీవన శైలిలో సైక్లింగ్‌ను భాగం చేసుకుంటే పౌర సమాజ శ్రేయస్సుతోపాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఆరోగ్యం కోసం కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. శారీరక వ్యాయామం కోసం క్రీడలు, నడక, స్విమ్మింగ్, సైక్లింగ్, యోగా వంటివి చేయాలన్నారు. 9వ తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్ సుబేదార్ మేజర్ సాగర్‌సింగ్ పాల్గొన్నారు.

సంఘటనతో ఐక్యత పెంపు



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సభ్యులు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : సంఘర్షణలతో సమాజం విడిపోతుందని, సంఘటన ఐక్యతను పెంచి మానవులను కలుపుతుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి చామర్తి ఉమామహేశ్వరరావు అన్నారు. జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం భగత్‌నగర్ భగవతి హైస్కూల్‌లో పాక రాజమౌళి రచించిన "భారత భారతి, భావ తరంగాలు" అనే రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమౌళి దేశ, దైవ భక్తికి చెందిన అద్భుత పద్య, గేయ, అనువాద కవిత్వాన్ని రచించారన్నారు. అశీతి (80 సం.లు దాటిన) సందర్భంగా సంస్థ పక్షాన రాజమౌళిని ఘనంగా సన్మానించారు. 'భారత భారతి' పుస్తకాన్ని ఉమామహేశ్వరరావు ఆవిష్కరించగా కెయు విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ చిలకమారి సంజీవ పరిచయం చేశారు. 'భావతరంగాలు' పుస్తకాన్ని వైద్యుడు డాక్టర్ భీమనాథుని శంకర్ ఆవిష్కరించగా స్తంభంకాడి గంగాధర్ పరిచయం చేశారు. జాతీయ సాహిత్య పరిషత్, హిందూ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో సంకలనం చేసిన 'ఓ హైందవ మేలుకో! నీ ధర్మాన్ని ఏలుకో!' పుస్తకాన్ని తెలుగు ఉపాధ్యాయడు డాక్టర్ ముత్తినేని శ్రీనివాస్ పరిచయం చేశారు. పరిషత్ అధ్యక్షుడు గాజుల రవీందర్, భగవతి, కేశవరెడ్డి విద్యాసంస్థల చైర్మన్లు రమణారావు, నాగిరెడ్డి కేశవరెడ్డి, సంస్థ ప్రధాన కార్యదర్శి నంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

బేతిగల్‌లో ఉచిత వైద్య శిబిరం

వీణవంక, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతిగల్ గ్రామంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. జాండిస్ నిర్ధారణలో భాగంగా 38ఇళ్లలో వైద్యులు సర్వే నిర్వహించారు. సర్వేలో 83మందికి టెస్టులు చేయగా రెండు ఫీవర్ కేసులు నమోదయ్యాయి. వారి బ్లడ్ శాంపిల్స్ సేకరించి మలేరియా నిర్ధారణ కోసం పంపిం చారు. 14మందికి డెంగ్యూ రాపిడ్ టెస్టులు చేయగా నెగిటివ్ వచ్చినట్టు వైద్యులు తెలిపారు. నెల రోజుల్లో 3 జాండిస్ కేసుల నమోదు కాగా వారు పూర్తిగా చికిత్స తీసుకొని కోలుకుంటున్నట్టు వైద్యాధికారి వరుణ తెలిపారు. సీజనల్ వ్యాధులు సోకకుండా శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డ్రైనేజీలు శుభ్రపరుచుకోవాలని బ్లీచింగ్ చేస్తూ ఉండాలని సూచించారు. జలుబు, దగ్గు, తలనొప్పి వస్తే రాపిడ్ టెస్టులు చేయించుకొని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మందులు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో ఎలాంటి విషజ్వరాలు నమోదు కాలేదని ఎవరు బయపడవద్దని తెలిపారు. గ్రామంలో మూడు రోజులపాటు మెడికల్‌క్యాంపు నిర్వహిస్తామని తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్లు శ్రావణ్ కుమార్, వరుణ, రజనీకాంత్, ఎంఎల్‌హెచ్‌పీ రత్నమాల, తదితరులు పాల్గొన్నారు.

మార్వాడి గో బ్యాక్ ఉద్యమానికి ఆర్‌పీఐ మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న కుతాడి శివరాజ్

సుభాష్‌నగర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మార్వాడి గోబ్యాక్ ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ) రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ తెలిపారు. ఆదివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్వాడి, గుజరాతి, రాజస్థాన్‌తోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి వ్యాపారాలు చేసుకుంటూ, రాష్ట్ర పౌరులపై దాడులు చేస్తుంటే చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలను కించపరిచే విధంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మోండా మార్కెట్‌లో ఒక మార్వాడీ దళిత యువకుడని కులంపేరుతో దూషిస్తూ, దాడి చేస్తే కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుతోపాటు కొందరు బీజేపీ నాయకులు దానిని ఖండించాల్సింది పోయి వారికి మద్దతు తెలుపడం ఏమిటని ప్రశ్నించారు.